



జ్యూస్ ఫ్యాక్టరీ ఎదుట పర్మిట్ల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు

మామిడి రైతులకు ప్రభుత్వం అండ

● రైతులకు రూ.168 కోట్ల సబ్సిడీ చెల్లిస్తాం ● మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకుని అండగా నిలుస్తుందని, సబ్సిడీ రూపంలో 168 కోట్ల రూపాయలు చెల్లిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అనుబంధ రంగాల శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో ఒక్కరోజు శనివారం పర్యటనలో భాగంగా మంత్రి చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని గుడిపాల మండలంలోని గొల్లమడుగులో మామిడికాయలు నిల్వ ఉంచిన పండ్ల యూనిట్ను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ ప్రసాద్ రావు, హార్టికల్చర్ సెక్రెటరీ రాజశేఖర్ బాబు, హార్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, జిల్లా అధికారులతో కలిసి ఆయన మామిడి పండ్ల యూనిట్‌ను పరిశీలించారు. కంపెనీలో మామిడికాయ ప్రాసెస్ యూనిట్లను చూశారు. మామిడికాయ జ్యూస్ ఎలా తయారవుతుందో తెలుసుకున్నారు. అనంతరం పల్లూరులో మామిడి రైతులతో ముచ్చటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, ఇందుకు టిడిపి ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆలోచనతో మామిడి రైతులను ఆదు కోవడానికి కంపెనీలతో చర్చించి ఒక ధర నిర్ణయం చామన్నారు. వివిధ కంపెనీలు 8 రూపాయలకే కెజీ మామిడి పండ్లు ధర నిర్ణయించిందని, నాలుగు రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని తెలిపారు. రైతులు స్వేచ్ఛగా వారు పండించిన మామిడి పంటను, మండీలలో కాని, మార్కెట్లో గాని అమ్ముకోవచ్చునని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేశారని తెలిపారు. చివరి కాయ వరకు విక్రయించు కోవచ్చున ని, 2019లో జిల్లాలో మామిడి ధర టిడిపి ప్రభుత్వమే రూ.7.50 పైసలకు ధర నిర్ణయించింది దన్నారు. రైతులు నాణ్యమైన మామిడి కాయలను కంపెనీలకు సరఫరా చేయాలని ఆదేశించారు. మామిడి రైతులకు 168 కోట్ల రూపాయల సబ్సిడీ రూపంలో అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రైతులు మార్కెట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద మామిడికాయలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం 22 మెట్రిక్ టన్నులు మామిడికాయలు కొనుగోలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలో పల్పరసం తయారీ విధానం పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

తప్పని అగచాట్లు!

- ఉదయం 10 గంటల నుండే రైతుల పడిగాపులు
- ప్రతి రోజూ ఫ్యాక్టరీల పరిమిత పర్మిట్లు
- కాయలు కొనుగోలు చేయకపోవడంతో నిరాశ
- విసిగిపోయి మామిడి రైతులు నిరసన

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ప్రభుత్వం మామిడి రైతులకు మద్దతు ధర ప్రకటించి ప్రైవేటు ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించినా అది అమలు కావడం లేదు. ప్రైవేటు ఫ్యాక్టరీలు ప్రతి రోజూ పరిమిత సంఖ్యలో పర్మిట్లు మంజూరు చేస్తోంది. ఉదయం 10 గంటల నుండే ఫ్యాక్టరీల వద్ద రైతులు పడిగాపులు కాశారు. చివరకు కొనుగోలు చేయక పోవడంతో రైతులు నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. దీన్ని నిరసిస్తూ మండలంలోని చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారిలోని గంగాధర నెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లి జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద రైతులు శనివారం పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.

మామిడి రైతుల అవస్థలు చూసి కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తో తమ సిబ్బందితో కలిసి ఫ్యాక్టరీ యజమాన్యంతో చర్చించి కేజీ రూ. 8 రూపాయలకు కొనుగోలు చేసేలా చర్చలు ఫలిం చాయి. దీనికి అదనంగా కూటమి ప్రభుత్వం నాలు గు రూపాయలు అందిస్తుందని కలెక్టర్ చెప్పారు. దీంతో టన్ను ధర 12 వేల రూపాయలుగా నిర్ణయ మైంది. వెదురుకుప్పం, కార్వేటినగరం, పాల సముద్రం, పెనుమూరు, గంగాధర నెల్లూరు, ఎస్ఆర్పురం రైతులే కాకుండా పక్క మండలాల నుంచి రైతులు ఈ జైన్ ఫ్యాక్టరీ దగ్గరకు టోకన్లు కోసం వస్తున్నారు. దీంతో అక్కడ మామిడి రైతులు కావలసిన దస్తావేజులు చేతిలో పట్టుకుని క్యూలైన్లో నిల్చుంటున్నారు. శనివారం అధిక సంఖ్యలో అక్కడికి చేరుకొని తమకు పర్మిట్లు ఇవ్వాలంటూ రైతులు ఆందోళన చేపట్టారు. జైన్ ఫ్యాక్టరీ యాజమాన్యం రోజుకి వంద టోకన్లు మాత్రమే పరిమితం చేసింది. అందువల్ల రైతులు ఉదయం 10 గంటల నుంచి చేరుకుంటున్నారు ఆ ఫ్యాక్టరీ దగ్గరికి చేరు కుంటున్నారు. తిండి తిప్పలు మాని టోకెన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పరిమితి పూర్తి అయితే రైతులు వెను తిరుగుతున్నారు. ఇది మామిడి రైతుల దినస్థితికి నిదర్శనం..

జైన్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

ఏపీ రైతు సంఘం డిమాండ్



మామిడి పరిశ్రమలు కలెక్టర్ ప్రొసీడింగ్స్ ను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న వారిపై ప్రధానంగా జైన్ పరిశ్రమపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకరన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్న జైన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిమితంగా టోకెన్ లు ఇచ్చి చేతులు దులుపు కుంటున్నారన్నారు. అధికార పార్టీ చెప్పిన వారికే టోకెన్‌లు ఇస్తున్నారు. నిజమైన రైతులకు పంట పక్వానికి వచ్చినా వారి పంటకు ఆర్డర్స్ ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. కలెక్టర్ దీనిపై తీవ్ర ప్రయత్నం చేస్తున్నా కింది స్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వం లక్ష్యం కూడా నీరుగారి పోతోంది. జిల్లా స్థాయిలో అధికారులు అనేక వ్యయ ప్రయాసలకు లోనై పని చేస్తున్న సన్న కారు రైతులకు న్యాయం జరగడం లేదు. రాజకీయాలకు అతీతంగా మామిడి రైతులను ఆదుకోవాలని కలెక్టర్ ఆదేశాలను పాటించాలని లేనిపక్షంలో రైతులను ఐక్యం చేసి పరిశ్రమల వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అరుదైన శస్త్ర చికిత్సకు వేదిక 'పిఇఎస్'

ప్రజాశక్తి -కుప్పం రూరల్ : కుప్పం పిఈఎస్ వైద్య కళాశాల అరుదైన శస్త్ర చికిత్సకు మరొక్కసారి వేదికగా మారింది. మహా నగరాలలోని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలను అందిస్తున్న పిఈఎస్ ఆసుపత్రిలో క్రెనియాటమి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. చికిత్స విజయవంతం కావడంపై ప్రఖ్యాత న్యూరో సర్జన్, గోల్డ్ మెడలిస్ట్ డాక్టరు మయూర్‌వికాకును ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిపురం మండలం రాళ్ళబుదుగురుకు చెందిన కోదండపాణి అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరు మహానగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందినట్లు తెలిపారు. ఇందుకోసం తన పొలాన్ని, బంగారాన్ని విక్రయించి సుమారు 15 లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే ఈ చికిత్స అనంతరం పక్ష వాతంతో పాటు మతిమరుపు వచ్చినట్టు తెలిపారు. ఈ క్రమంలో వారు పి ఈ ఎస్ ఆసుపత్రికి చేరుకోగా అతడిని పరీక్షించిన న్యూరో సర్జన్ అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యాన్ని అందించినట్లు తెలిపారు.



శస్త్ర చికిత్స నిర్వహించిన న్యూరో సర్జన్



శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న పి ఈ ఎస్ ఆస్పత్రి వైద్యులు

మూడు రాష్ట్రాల యువత ఉద్యోగులుగా ఎంపిక

ప్రజాశక్తి -కుప్పం రూరల్ :

కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళా లో మూడు రాష్ట్రాల యువత ఉద్యోగులుగా ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. బిసిఎన్ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, కుప్పం డిగ్రీ కళాశాల, బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ వారు కెరీర్ జాబ్ ఫెయిర్ 2025 నిర్వహించారు. ద్రవిడ కూడలిలోని కుప్పం ప్రాంతంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు విచ్చేశారని తెలిపారు. ఈ సందర్భంగా 30 కి పైగా వివిధ పరిశ్రమలు నిర్వహించిన ఎంపికలలో 627 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. మీరందరికి నియామక పత్రాలు అందించామని, భవిష్యత్తులో తాము మరిన్ని జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బిసిఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమములో కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ వైస్ చైర్మన్ డాక్టరు సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు భాస్కరన్, సిడిఓ డాక్టరు జయకుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన యువతతో ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది

20, 21 తేదీల్లో డీఎస్సీ పరీక్షల మార్పు

జులై 1, 2 తేదీల్లో నిర్వహణ


ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించిందని ఈ నేపథ్యంలో జూన్ 20, 21 తేదీల్లో న్విహించాల్సిన డీఎస్సీ పరీక్షల తేదీలను మార్పు చేస్తున్నట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

యోగా డే సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని వారి రాకపోకలకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో ఈ పరీక్షల తేదీలు మార్చినట్లు తెలిపారు. ఈ అభ్యర్థులకు జూలై 1, 2 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తామని, దీనికి సంబంధించి పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలను మార్చిన హాల్ టిక్కెట్లు ఎపి మెగా డిఎస్‌సి -2025, వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్: ఏపిడిఎస్‌సి.ఎపిసిఎఫ్ ఎస్ఎస్.ఇన్ 25-06-2025 న అందుబాటులో వుంచుతామని తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి మార్చిన హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని వాటి ప్రకారం పరీక్షలకు హాజరు కావాలని మెగా డీఎస్‌సి -2025 కన్వీనర్ కృష్ణారెడ్డి కోరారు.


మృతుల కుటుంబాలకు ఓదార్పు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కర్ణాటక రోడ్డు ప్రమాదంలో ఆళ్లమడుగుకు చెందిన కేశవులురెడ్డి, అతని తమ్ముని కుమారుడు శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే.. ఆళ్లమడుగుకు తీసుకొచ్చిన కేశవుల రెడ్డి, అతని తమ్ముని కుమారుడి మృతదేహానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి శనివారం నివాళు లు అర్పించారు. మృతుల కుటుంబా లను పరామర్శించి ఓదార్చారు. మృతదేహాలు స్వగ్రామానికి చేరుకున్న వెంటనే బంధువులు, కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్ను అంటాయి. స్థానిక నాయకులు, కార్యకర్తలను చూసి వారు బోరున విలపించారు. కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పి ఓదార్చారు. మృతుడి భార్య శ్యామల, పిల్లలను పట్టుకుని 'నాయనా మనకి ఇక దిక్కు ఎవరు?' అని ఏడవడంతో ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది. ప్రభుత్వం తమను ఆదుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శారద మృతదేహానికి పలువురు నివాళులు



వెదురుకుప్పంలో



జిడినెల్లూరులో నివాళులు అర్పిస్తున్న నాయకులు

గంగాధర నెల్లూరు: కర్ణాటక రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శారద మృతదేహాన్ని మండలంలోని పాపిరెడ్డిపల్లి పంచాయతీ మారేడుపల్లికి శనివారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శారద మృత దేహానికి పలువురు టిడిపి, వైసిపి నేతలు నివాళు లర్పించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సూచనల మేరకు మృతురాలి భర్త విశ్వనాథరెడ్డికి పదివేలు రూపాయలు అంత్యక్రియ ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ఫోన్ ద్వారా కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఓదార్చి ప్రభుత్వ పరంగా వారి కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన తెలిపారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నేతలు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమనాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీధర్ యాదవ్, జిల్లా ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, నాయకులు బాబు నాయుడు, రుష్యేంద్ర రెడ్డి, మాధవరెడ్డి, గోపి, వెంకటేష్‌తో పాటు పలువురు టిడిపి నేతలు నివాళులర్పించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసీపీ సీనియర్ నేత చిన్నమరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి శారద మృతదేహానికి నివాళులర్పించారు.

ఎస్ఆర్ పురం : కర్నాటక రోడ్డు ప్రమాదంలో ఎస్ఆర్ పురం మండలం లోని పుల్లూరు గ్రామానికి చెందిన రమేష్ ముని లక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె తులసి అలియాస్ తనుజ (21) మృతి చెందగా మృతురాలు చిన్నాయన సిద్దయ్య (42) తీవ్ర గాయాలతో ప్రమాదం నుండి బయటపడిన సంగతి విదితమే.. శుక్రవారం తులసి మృతదేహం గ్రామానికి చేరు కుంది. దీంతో గ్రామస్తులు బోరున వినిపిం చారు. శోకసంద్రంలో మునిగిపోయింది. అంతి మయాత్రలో పలువురు పాల్గొన్నారు. రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కేంద్ర బిజెపి కార్యవర్గ సభ్యులు రాజేంద్రన్ , నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ డాక్టర్ పొన్న యుగంధర్, ఎస్ఆర్ పురం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గంధం నేని జయ శంకర్ నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు ఆమె మృతదేహానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురం లో

గాయపడ్డ బస్సు డ్రైవర్ మృతి

గంగాధరనెల్లూరు: కర్ణాటక రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆర్టీసీ బస్సు డ్రైవర్ లక్ష్మీ కరణ కుమార్ రెడ్డి (50) శనివారం బెంగళూరు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని బంధువులు తెలిపారు. చిత్తూరు ఆర్‌టిసి డిపోలో డ్రైవర్ గా లక్ష్మీ కరుణ కుమార్ రెడ్డి పనిచేస్తున్నారు. చిత్తూరు నుంచి బెంగళూరుకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు కర్ణాటక హోస్‌పేట వద్ద లారీ ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మీ కరుణ కుమార్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డ్రైవర్ లక్ష్మీ కరుణకుమార్ రెడ్డి శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయం గ్రామంలో పలువురుకి తెలియడంతో బంధువులు, గ్రామస్తుల్లో విషాద ఛాయలు అలుము కున్నాయి. మృతుడు బస్సు డ్రైవర్‌కు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ యజమాని లక్ష్మి కరుణ కుమార్ రెడ్డి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరు అయ్యారు. సొంతూరులో ఆదివారం ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.



మృతిచెందిన ఆర్‌టిసి డ్రైవర్ (ఫైల్‌ఫోటో)

జిల్లా కో ఆపరేటివ్ అధికారిణి లక్ష్మీ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా కో ఆపరేటివ్ అధికారిణిగా లక్ష్మీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ , సెట్విన్ సీఈఓ గా పనిచేసిన లక్ష్మి జిల్లా కో-ఆపరేటివ్ అధికారినిగా బాధ్యతలు స్వీకరించారు. లక్ష్మిని పలువురు సహకార బ్యాంకు ఉద్యోగులు, సహకార పరపతి సంఘాల ఉద్యోగులు కలసి అభినందించారు.



రేషన్ షాపు డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన రవి

రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రవి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

చిత్తూరు మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ సమావేశం శనివారం స్థానిక టెలిఫోన్ కాలనీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ షాప్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రవి, ఉపాధ్యక్షులుగా యువరాజు, ట్రెజరర్ గా మనీ, జాయింట్ సెక్రెటరీగా సాయికుమార్, గౌరవ సలహాదారులుగా జ్యోతీశ్వర్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెక్ డ్యామ్ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి

ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి- పలమనేరు: కౌండిన్య నది పరివాహక ప్రాంతంలో చెక్ డ్యామ్‌ల నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. పలమనేరు తన కార్యా లయంలో శనివారం ఇరిగేషన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కౌండిన్య పరివాహక ప్రాంతంలో నాలుగు చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు, ఏడు కొత్త చెక్ డ్యామ్‌ల అవసరం వుందని గతంలో గుర్తించి మొత్తం 11 చెక్ డ్యామ్‌ల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని ఆ పనులు ఏ మేరకు జరుగుతున్నాయి?' అని డిఈ చొక్లా నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. కైగల్ ప్రాజెక్టు, గంగన్న శిరస్సు ప్రాజెక్టు ఏ దశలో వున్నాయి.?ఏవైనా ఇబ్బం దులు ఉంటే తనకు తెలిపితే ప్రభుత్వంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఇటీవల పలమనేరులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా అందిన బైరెడ్డిపల్లిలో 31 చెక్ డ్యామ్ పనులకు పంపిన అంచనా వివరాలు అడిగి తెలుసు కున్నారు. మరో వైపు గంగవరం మండలం అటుకు రాళ్ల పల్లిలో చెరువు కట్ట మరమ్మతులు చేయాలని అధికారులు తెలపగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు ఇప్పిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఇప్పటి దాకా నిర్దేశిం చుకున్న పనులన్నీ త్వరగా పూర్తి చేసేందు కు అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశిం చారు. ఈ సమావేశంలో ఏఈ లక్ష్మీ నారాయణ, టిడిపి నాయకులు కిషోర్ గౌడ్, సోమశేఖర్ గౌడ్, ప్రతాపరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



అధికారులతో చెక్ డ్యామ్‌ల నిర్మాణ పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్

ఆనందం వ్యక్తం చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

దూర ప్రాంతాల నుండి చిత్తూరు నగరానికి వచ్చి రోజువారి కూలీలుగా పనిచేస్తున్న కార్మికులు, రోజువారీ కూలీల తీర్చేలా ఐదు రూపాయలకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం ,రాత్రి భోజనం అందిస్తున్న అన్నా క్యాంటీన్ పేదల ఆకలి తీరుస్తోందని పూట కూలీలు, కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 600, 700 కూలి కోసం రోజంతా పనిచేస్తున్న తమలాంటి వారికి అన్నా క్యాంటీన్‌లో ఐదు రూపాయలకే భోజనం దొరకడం ఎంతో సంతోషంగా ఉందంటున్నారు. కూలి డబ్బుల్లో రోజుకు 100 నుండి 150 రూపాయలు టిఫిన్, భోజనం కోసం ఖర్చు చేయాల్సి ఉండేదని అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం వల్ల పది రూపాయలకే టిఫిన్, భోజనం తిని మిగిలిన డబ్బులు కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతున్నట్లు చెబుతున్నారు. చిత్తూరు నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్లో జూన్ 17, 2024 లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేదల ఆకలిని తీర్చేలా అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ఈ క్యాంటీన్లో రోజుకు 1000 మంది వరకు రోజువారి కూలీలు, కార్మికులు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం, రాత్రి భోజనం చేస్తున్నారు. అన్నా క్యాంటీన్లో అందిస్తున్న అల్పాహారం భోజనం ఎంతో రుచికరంగా ఉందంటున్నారు. ఐదు రూపాయలకే మూడు ఇడ్లీ చట్నీ సాంబార్, లేదా పూరి కుర్మా, మధ్యాహ్నం రాత్రి వైట్ రైస్, సాంబార్, రసం, పెరుగు, పచ్చడి అన్నా క్యాంటీన్లో ఐదు రూపాయలకే అందిస్తున్నారు.

ఐదు రూపాయలకే ఆకలి తీరుతోంది

ఐదు రూపాయలకే ఆకలి తీరుతోందని రాజమండ్రి కి చెందిన భవన నిర్మాణ కార్మికుడు రాజా తెలిపారు. అన్నా క్యాంటీన్ కు ఐదు కిలోమీటర్ల దూరంలో అపార్ట్మెంట్ నిర్మాణంలో తాను రోజువారి కూలీగా పని చేస్తున్నానని. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడుపూటలా 15 రూపాయలకే అల్పాహారం భోజనం చేస్తున్నట్లు తెలిపారు.

టేస్ట్ చూద్దామని వచ్చా

అన్నా క్యాంటీన్లో భోజనాలు ఎలా ఉన్నాయో చూసేందుకు వచ్చినట్లు పెనుమూరు మండలానికి చెందిన రైతు మురళి తెలిపారు. తాను చిత్తూరు నగరానికి వ్యవసాయ పనిముట్ల కోసం వచ్చానని అన్నా క్యాంటీన్లో అందిస్తున్న ఐదు రూపాయల భోజనం చాలా బాగుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.





కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నేత్ర శస్త్ర చికిత్సకు 28 మంది ఎంపిక

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని ముసలయ్య గారి పల్లిలో మనోహర్ రెడ్డి ఆధ్వర్యం లో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి రోగుల కు వైద్య పరీక్షలు చేసి 28 మందిని ఎంపిక చేశారు. చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి సహకారంతో ముసలయ్య గారి పల్లి కమ్యూనిటీ భవనంలో 70 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 28 మందిని చికిత్స కోసం ఎంపిక చేశారు. వీరికి చెన్నైలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు శస్త్ర చికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, దామోదర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న ప్రముఖులు

మహాభారత యజ్ఞానికి విరాళం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల, ఇరికిపెంట పంచాయతీల పరిధి లోని భారతం మిట్ట లో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞా నికి పలువురు నగదు విరాళాలు అందించారు. బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్ కె రమణారెడ్డి 50 వేల రూపాయల నగదు, ఇరికిపెంట మేటి మంద గ్రామానికి చెందిన మధుసూదన్ నాయుడు 20 వేల రూపాయల నగదును నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి అసత్య ప్రచారం తగదు: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -శాంతిపురం : ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని, రూ.2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేయడం తగదని టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మండిపడ్డారు. 'వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారు. అంటే రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా?' అని ప్రశ్నించారు. 42 లక్షల మందికి మాత్రమే జగన్ ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇచ్చిందన్నారు. గతంలో అమ్మఒడి ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి అని, నేడు పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ కావడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు.



మొక్కల రక్షణకు కృషి చేయాలి

బీటెక్ విద్యార్థిని జ్ఞాన దీప్తి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మొక్కలు రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బిటెక్ విద్యార్థిని జ్ఞాన దీప్తి అన్నారు. శనివారం బంగారుపాళ్యం మండలంలోని వ్యవసాయ క్షేత్రంలో మేము కళాశాల బీటెక్ రెండవ సంవత్సరం విద్యార్థినులు కళాశాల యాజమాన్యం అధ్యాపకులు లోకేష్ సూచనల మేరకు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు మొక్కలు నాటేటప్పుడు అధునాతన పద్ధతులను ఎంచుకోవాలని మొక్కల వల్ల ఆక్సిజన్ వెలువడుతుందని కార్బన్డైఆక్సిడేను పీల్చుకుని ఆక్సిజన్ వదలడం వల్ల మనుషులు మనగూడ సాధిస్తున్నారని మొక్కలకు ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా మొక్కలు కాపాడాలన్నారు. వృక్ష రక్షణ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో దివ్య, హాసిని, జ్ఞాన శ్రీ లు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించండి

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతుల నిరసన

ప్రజాశక్తి- కార్వేటినగరం: మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గం కాంగ్రెస్ కన్వీనర్ రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చింత మండి సమీపంలోని ఏటీఎస్ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద కాంగ్రెస్ నాయకులతో కలసి మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి ఒక్క సారి వచ్చే మామిడి పంటకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఫ్యాక్టరీ తరఫున రూ.8కు కొనుగోలు చేసేలా చూడాలని, రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నాలుగు రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జాతీయ రహదారిపై ఫ్యాక్టరీ ఎదుట మామిడి రైతులతో కలసి నిరసన చేపట్టుడుకు సిద్ధం గా వున్నామని హెచ్చరించారు. స్థానిక రైతుల నుంచే మామిడి కాయలు కొనుగోలు చేయాలని, లారీలలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మామిడి కాయలను అనుమతించ రాదన్నారు. అనంతరం ఫ్యాక్టరీ మేనేజర్ వెంకటేశ్వర్లుకు రైతులతో కలసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు



సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎంఆర్పిఎస్

ప్రజాశక్తి-సోమల:

ఎంఆర్పిఎస్ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఇందుకోసం క్షేత్రస్థాయిలో, గ్రామ, వార్డు పరిధిలో విద్యావంతులైన యువతకు మహిళలకు ప్రాధాన్యత నిచ్చి పదవులను కేటాయించి మందకృష్ణ మాదిగ ఆశయాలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సోమనలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఇన్ఛార్జి కిషోర్ మాట్లాడుతూ జూలై 7వ తేదీ ఎంఆర్పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మందకృష్ణ మాదిగ తన ఉద్యమంతో తీసుకువచ్చిన అనేక సంక్షేమ కార్యక్రమాల ను అన్ని వర్గాల వారికి తెలిసే విధంగా చేయాలని నూతన కమిటీలను ఎన్నుకొని వీటిలో విద్యావంతులను యువతను మహిళలను చేర్చుకొని మందకృష్ణ మాదిగ ఆశయాలను ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమల మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు ఎర్రబెల్లి రవి, ఎం పి ఎస్ మండల అధ్యక్షులు ప్రకాష్, నియోజకవర్గ ఇన్చార్జి నరసింహులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథం, వెంకటరామయ్య, శుభకర్, సురేంద్ర రవి కృష్ణయ్య ఆర్య దొరసామి పాల్గొన్నారు.

అడిగోపుల వెంకటరత్నం ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - తిరుపతి సిటి:

తిరుపతి, యశోద నగర్లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం అడి గోపుల వెంకటరత్నం ప్రతిభా పురస్కారం సభ ఘనంగా నిర్వహించారు. అడి గోపుల ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు, కుటుంబ సభ్యులు ఈ అవార్డుల ప్రదానం ఏర్పాటు చేశారు. సాహిత్యం రంగంలో విశేష కృషి చేసిన రావేల సాంబశివరావు, సాహితీ పరిశోధకులు జి. రమేష్ బాబు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా విచ్చేశారు. యస్వీయు వీసి ప్రొ. అప్పారావు, ద్రావిడ యూనివర్సిటీ మాజీ వీసి సత్యనారాయణ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అడి గోపులవారు రాసిన 'అక్షరాలు మొలకెత్తుతూనే ఉంటాయి' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ప్రొ. వెంకటేశ్వర్లు పుస్తక సమీక్ష చేశారు. అడిగోపుల సాహిత్యం నేటి సమాజానికి చాలా అవసరమని యస్వీయు వీసి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారపు నాగార్జున, సాకం నాగరాజు, బీరం సుందరరావు, ప్రొ. మురళి, మల్లేశ్వరరావు, సాహిత్య ప్రముఖులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - నాగలాపురం:

నాగలాపురం మండలం, సురుటుపల్లిలో వెలిసిన శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతిరోజు జరుగు నిత్య అన్నదానానికి శ్రీకాళహస్తికి చెందిన రాజేశ్వరి, సుధాకర్ రెడ్డి దంపతులు లక్ష రూపాయల విరాళం ఆలయ కార్యనిర్వహణాధికారి లతకు శనివారం అందించారు. వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.

జగన్ క్షమాపణ చెప్పాలి: టిడిపి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సాక్షి మీడియాలో అమరావతి మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని టిడిపి మహిళా నాయకులు కార్పొరేటర్ అరుణ, చుడా చైర్పర్సన్ కటారి హేమలత డిమాండ్ చేశారు. సాక్షి మీడియా వ్యాఖ్యానాలను నిరసిస్తూ శనివారం స్థానిక జిల్లా కోర్టు నుండి గాంధీ విగ్రహం వరకు తెలుగు మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్న కూటమి ప్రభుత్వంపై సాక్షి పత్రిక మీడియా విషం కక్కుతోందని తెలుగు మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జలవనరుల శాఖ సర్కిల్ ఏఈఈల సంఘం అధ్యక్షుడిగా ముని శంకర్

ప్రజాశక్తి - రామచంద్రపురం :

తిరుపతి జలవనరుల శాఖ టిజిపి అండ్ జీఎన్ఎస్ఎస్ సర్కిల్ సహాయ కార్య నిర్వాహణ అధికారుల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శనివారం తిరుపతి జల వనరుల శాఖ కార్యాలయంలో ఎలక్షన్స్ ఆఫీసర్గా మదన్ మోహన్ గౌడ్, కన్వీనర్గా చందా రెడ్డి సురేష్ లు వ్యవహరించారు. వీరి ఆధ్వర్యంలో ప్రెసిడెంట్గా ముని శంకర్, ఏఈఈ, అసోసియేట్ ప్రెసిడెంట్గా గురు శేఖర్, వైస్ ప్రెసిడెంట్గా పెంచలయ్య, దమరక, జనరల్ సెక్రటరీగా మురళీ కృష్ణా రెడ్డి, కోశాధికారిగా గిరీష్, జాయింట్ సెక్రటరీలుగా సలోమి, ప్రశాంత్, మురళి, రవిశంకర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు సహ ఉద్యోగుల అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జలవనరుల శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ దంపతులు మృతి

అనాథలైన పిల్లలు

ప్రజాశక్తి -ఐరాల: ఐరాల మండల పరిధిలోని మామిడి గుట్టపల్లికి చెందిన రాజేష్, పూర్ణిమ దంపతులు మూడు రోజుల క్రితం చిత్తూరు బ్యాన్స్ హోటల్ హైవే వద్ద కుటుంబ సభ్యులతో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా లారీ ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డ సంగతి విదితమే.. ఈ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్ రెండు రోజుల క్రితం స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత రాత్రి రాణిపేట సిఎంసిలో చికిత్స పొందుతున్న పూర్ణిమ పరిస్థితి విషమించి మరణించింది. ప్రస్తుతం కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. రెండు రోజుల వ్యవధిలో దంపతులు ఇద్దరూ చనిపోవడంతో బంధు వులు, గ్రామస్తులు అందరూ శోకసంద్రంతో మునిగి పోయా రు. తల్లిదండ్రుల మృతి తో అనాథలైన చిన్నారులను ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటా మని, ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జనసేన నాయకుడు ఎం మహేశ్వర్ హామీ ఇచ్చారు, ఇదే విష యంపై కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్తో చర్చించి వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.



ప్రమాదంలో గాయపడిన దంపతులు (ఫైల్ఫొటో)

హామీలను నెరవేరుస్తాం : మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉందని, సూపర్సిక్స్ హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తోందని పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం రామాపురం డంపింగ్ యార్డును గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్త నిల్వలను, ఆర్థిక అవకతవకలతో పది లక్షల కోట్ల రూపాయల అప్పులను ఈ ప్రభుత్వానికి వదిలేసి వెళ్లిందన్నారు. విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని, ఏడాదిలో రాష్ట్రంలో ఉన్న 85 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేస్తామన్నారు. చెత్తను క్లియర్ చేయడానికి అనేక కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. ఇప్పటివరకూ 45 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామన్నారు. తిరుపతిలో జిగ్మా కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. వాళ్లు రోజుకు 900 టన్నుల లెగసి క్లియర్ చేస్తున్నారన్నారు. అయితే రోజుకు 2,700 టన్నులు క్లియర్ చేయాల్సి ఉందన్నారు. ఏవైతే మున్సిపాలిటీలు రోజువారీగా క్లియర్ చేయాల్సిన లెగసీ కన్నా తక్కువ చేస్తున్నారో, వాటిని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామన్నారు. పవర్ కనెక్షన్ లేదని కంపెనీవారు చెబుతున్నారని చెప్పగా, నాలుగైదు రోజుల్లో కనెక్షన్ ఇస్తామని ఎస్పిడిసిఎల్ ఎస్ఇ తెలిపారు. మున్సిపల్ శాఖ ద్వారా ప్రజలు కోరుకునేది స్వచ్ఛమైన తాగునీరు, రోజువారీ చెత్త తొలగించడం, టాయిలెట్లు నుంచి వచ్చే సీవరేజ్ వాటర్ను క్లియర్చేయడం, వర్షాలు వస్తే నీరు బయటకు పోయేలా చూడటం అన్నారు. సూపర్సిక్స్లో భాగంగా తల్లికి వందనాన్ని తల్లుల ఖాతాలో 15వేల వంతున జమ చేశామన్నారు. రానున్న కాలంలో మరో 70 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ గోమతి పాల్గొన్నారు



తిరుపతి ఖ్యాతి పెంచేలా 'హోంస్టే'లు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

'అతిథి' దేవుడితో సమానమనిపూర్వీకులు చెప్పిన నానుడిని తిరుపతి ప్రజలు నిజం చేయాలని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. శనివారం తిరుపతి మంగళం రోడ్డులో డాక్టర్ సయ్యద్ సుమయ్య ఏర్పాటుచేసిన హిల్ సైడ్ హెవన్ హోమ్ స్టే ని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. డాలర్స్ దివాకర్ రెడ్డి కి నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశ నలుమూలల నుంచి కాకుండా దేశ విదేశాల నుంచి యాత్రికులు, భక్తులు తిరుపతికి విచ్చేస్తున్నారని తెలియజేశారు. వారందరికీ మంచి ఆతిథ్యం ఇవ్వడం మన బాధ్యత అని పేర్కొన్నారు. శుచి శుభ్రతతో కూడిన ఆహారం, గౌరవ మర్యాదలతో కూడిన ఆతిథ్యం ఇచ్చినప్పుడే తిరుపతి నగరానికి మరింత ఖ్యాతి చేకూరుతుందని అన్నారు.



దళితులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నిరసన

ప్రజాశక్తి-పలమనేరు: గంగవరం మండలం గుండుగల్లు దళితులపై దాడి చేసిన అగ్రకుల పెత్తందారులను వెంటనే అరెస్ట్ చేయాలని జాతీయ మానవ హక్కులు , అవినీతి నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామ దళితులు, పలమనేరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మానవ హక్కుల సంఘం నాయకులు డివి మునిరత్నం, సోమరాజు, సరస్వతి, బాధితులు మాట్లాడుతూ దళితులను కొట్టి గాయపరిచిన విషయంపై పోలీసులు కేసు నమోదు చేసినా దాడికి బాధ్యులైన పెత్తందారులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేసును నిర్లక్ష్యం చేసే కొద్దీ పెత్తందారులు తమ రాజకీయ, ధన, కుల బలాలను ప్రయోగించి కేసును నీరు గార్చే ప్రమాదం వుందని గుర్తు చేశారు. దళితులపై అగ్రకులస్తులు దాడి చేసిన ప్రతి కేసులోను దళితులు అడుక్కుని కేసు నమోదు చేసుకునే పరిస్థితులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు ఆత్మ అభిమానం, ఆత్మగౌరవంతో బతకాలని చట్టాలు ఉన్నప్పటికీ పెత్తం దారులు, వారికి తోడు ప్రభుత్వ అధికారులు వాటిని తుంగలో తొక్కి దళితుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. గుండుగల్లు దళితులు ఇప్పటికీ ధైర్యంతో గ్రామంలో తిరగలేక ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారని, దళితులను హతమార్చడానికి పెత్తం దారులు చందాలు వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ప్రకాష్, రాంబాబు మీడియా ద్వారా స్వయంగా తెలిపారని గుర్తు చేశారు. కార్యదర్శి మణి, ట్రెజరర్ రమణారెడ్డి ,సాంబశివ, రత్నమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు దళితులపై చిత్తశుద్ధి ఉంటే పున్నయ్య కమిషన్ సిఫారసుల మేరకు ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీలు, ఎస్సీ ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం జరిపి చట్టాలపై, హక్కులపై అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత పోలీసు అధికారులు గ్రామంలో సమగ్రమైన విచారణ జరిపి దళితుల పై దాడి చేసి అవమానించిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ, సూర శ్రీనివాసులు, రామచంద్ర, ఆంజప్ప, 40 మంది బాధితులు పాల్గొన్నారు.




వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న మానవ హక్కుల సంఘం నాయకులు

యోగాపై అవగాహన

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో యోగా శిక్షణను కమిషనర్ ఎన్వి రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి వార్డు సచివాలయల పరిధిలోని 116 శిబిరాలలో మెగా యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్ స్నేహ ప్రియ , టిపిఎస్ పి ఇందిర, బాబా, యోగా ట్రైనర్లు, మహిళా మండలి సంఘ సభ్యులు, కౌన్సిలర్లు కిరణ్ , కురభ సంఘ రాష్ట్ర డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడ్ , ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ సభ్యులు నాగరాజు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలో అన్నీ సచివాలయాల పరిధిలో ముందే నిర్ణయించిన 117 వేదికలలో గ్రామ స్థాయి యోగా శిక్షకులు యోగా రిహార్సల్ కార్యక్రమాలు నిర్వహిం చారు. శనివారం. ఎంపీడీఓ పురుషోత్తం వెదురుకుప్పం సచివాలయ పరిధి లోని మొత్తం తొమ్మిది యోగా వేదికల రిహార్సల్స్ లలో, తహశీ ల్దారు బాబు పచ్చికా పల్లం యోగా రిహార్సల్లో పాల్గొన్నారు. ఎంపీడీఓ మట్లాడుతూ జూన్ 21న నిర్వహించనున్న యోగా దినోత్స వంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కార్వేటినగరంలో యోగాను రోజువారీ దినచర్యలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు రావని నగరి డీఎస్పీ సయద్ మహ్మద్ అజీజ్ తెలిపారు. శనివారం మండలంలోని కృష్ణాపురం జలాశయం వద్ద సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి రోజూ ఓ అర్ధగంట రోజువారి ప్రణాళికలో యోగా చేస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుందని డిఎస్పి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మునికృష్ణ. పోలీస్ సిబ్బంది, పలువురు అధికారు లు పాల్గొన్నారు. అన్నూరు సచివాలయంలో ఎంఈవో విజయ కుమార్, వీఆర్వో ఆనందప్ప పాల్గొన్నారు.

సోమల: దిడ్డివారిపల్లి సచివాలయ కార్యదర్శి ఆనంద్ మహాభారతంలో నాటకాలు ప్రదర్శించే స్టేజిపై శనివారం ఉదయం గ్రామస్తులు యోగాసనా లు వేయించారు.

పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కమిషనర్ ఎన్వి రమణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ప్రతి వార్డు సచివాలయల పరిధిలో116 శిబిరాల్లో 'మెగా యోగా డే'ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, అసిస్టెంట్ ఇంజనీర్ స్నిహ ప్రియ , ఇందిర, బాబా, యోగా ట్రైనర్లు, మహిళా మండలి సంఘ సభ్యులు, కౌన్సిలర్లు కిరణ్ , కుమార్ , కురభ సంఘ రాష్ట్ర డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడ్ , ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.



పలమనేరులో

సుపరిపాలన చంద్రబాబుకే సాధ్యం

జిల్లా నాయకులు శ్రీధర్ యాదవ్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సుపరిపాలన చంద్రబాబు కే సాధ్యమవుతుందని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ పేర్కొన్నారు. 'తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మహిళ సోనీ తల్లికి వందనం అమలు చేసినందుకు టిడిపి నాయకుల వద్ద హర్షం వ్యక్తం చేశారు. తమకు ముగ్గురు పిల్లలు ఉన్నారని ముగ్గురికి 39 వేల రూపాయలు అందాయని తమ పిల్లల చదువకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ఇలాగే కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తున్నారని సూపర్ సిక్స్ పథకాల అమలే ఇందుకు నిదర్శనమన్నారు. సుపరిపాలన ఆయనకే సాధ్యమని కొనియాడారు.

పలమనేరు: తల్లికి వందనం అమలు చేయడంపై పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్ర పటాలతో పాటు విద్యాశాఖ మంత్రి లోకేష్, స్థానిక ఎమ్మెల్యేల ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు నిర్వహించి పూలు చల్లి హర్షం వ్యక్తం చేశారు. పలమనేరు పట్టణంలోని లక్ష్మీ నగర్ కాలనీలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



జిడి నెల్లూరులో మాట్లాడుతున్న పిల్లల తల్లులు